సాక్షి జగిత్యాల

గురువారం । 16 । నవంబర్ । 2023



రెండోరోజు గంగాహారతి

ధర్మపురి: శ్రీలక్ష్మినృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రెండోరోజైన బుధవారం గంగాహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ఆనందం.. అంతలోనే విషాదం

జిల్లాకేంద్రం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. కారు బోల్తా పడడంతో సంఘటన చోటుచేసుకుంది. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. ఉదయం, సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయ అనుబంధమైన యమధర్మరాజు దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ముత్యాలశర్మ స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నృసింహుని సన్నిధిలో నవీన్‌మిట్టల్ పూజలు



సన్నిధిలో మిట్టల్ దంపతులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామిని బుధవారం ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవస్థానం పక్షాన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో దూలం మధు, తహసీల్దార్ కృష్ణచైతన్య తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మోతీనగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

సారంగాపూర్: జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో వానాకాలం పంట కొనుగోళ్లకు 279 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సహకార అధికారి మాదాసు సత్యనారాయణ అన్నారు. బీర్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మోతీనగర్, రంగసాగర్, కండ్లపల్లి, తుంగూర్, చర్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని తెలిపారు. రైతులు నాణ్యత నిబంధనలు పాటిస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలన్నారు. కార్యక్రమంలో అడాప్షన్ అధికారి స్వప్న, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్, సంఘం సీఈవో అయ్యోరి తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

నేడు కోరుట్లకు ఎమ్మెల్సీ కవిత రాక



జగిత్యాల: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 16న జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బండలింగాపూర్‌లో ఉదయం 10 గంటలకు, మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో 11 గంటలకు, ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్నం ఒంటిగంట కు, మల్లాపూర్‌లో మధ్యాహ్నం మూడు గంట లకు, అయిలాపూర్‌లో సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

జగిత్యాల చేరిన శ్రీరామ పాదుకల పాదయాత్ర



పాదుకలతో వీహెచ్‌పీ నాయకులు

జగిత్యాలటౌన్: అయోధ్య శ్రీరాముడి పాదుకల పాదయాత్ర బుధవారం జిల్లాకేంద్రానికి చేరింది. విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ ఆధ్వర్యంలో శ్రీరామ పాదుకల పాదయాత్రకు శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అర్చకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, హిందూవాహిని కార్యకర్తలు, హిందూబంధువులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బరిలో 216 మంది



- నామినేషన్ ఉపసంహరించుకున్న 57 మంది అభ్యర్థులు
- స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- తప్పుకున్న ఉమ, కటకం, నల్ల, నాగి
- చాలాచోట్ల త్రిముఖ పోటీ!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేషన్ల స్క్రూటినీ పూర్తయింది. 12 నియోజకవర్గాల్లో మొత్తం 216 మంది పోటీలో ఉండగా.. 57 మంది తమ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. జాతీయ, స్థానిక పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు ఈసారి బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ లాంటి పార్టీల నుంచి బరిలో ఉండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో కనీసం మూడు పార్టీలు బరిలో ఉన్నాయి. గతంలో బీజేపీకి సరైన అభ్యర్థులు దొరకని పరిస్థితి. ఈసారి మాత్రం దాదాపు అన్నిచోట్ల బలమైన కేండిడేట్లు ఉన్నారు. మూడు బలమైన పార్టీలు ఉండటంతో త్రిముఖ పోరు తప్పేలా లేదు. మరోవైపు ఆర్వోలు ఇండిపెండెంట్లు, చిన్న పార్టీలకు డ్రా సిస్టమ్ ద్వారా గుర్తులను కేటాయించారు. దీంతో స్వతంత్రులందరూ తమకు కేటాయించిన గుర్తుతో ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలన్నీ అగ్రనేతలతో భారీ బహిరంగ సభలకు, కార్నర్ మీటింగులకు ఇప్పటికే అనుమతులు తీసుకున్నాయి.

నియోజకవర్గాల వారీగా సమాచారం

నియోజకవర్గం	బరిలో	విత్‌డ్రా
కరీంనగర్	27	04
హుజూరాబాద్	22	11
చొప్పదండి	14	03
మానకొండూరు	10	03
సిరిసిల్ల	21	02
వేములవాడ	16	04
పెద్దపల్లి	17	08
మంథని	21	03
రామగుండం	23	03
జగిత్యాల	15	04
కోరుట్ల	15	05
ధర్మపురి	15	03
మొత్తం	216	57

తప్పుకున్న వారిలో బంధువులే అధికం

నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో అధికంగా ప్రధాన పార్టీలకు చెందిన డమ్మీ కేండిడేట్లు, అక్కడక్కడా అసంతృప్తులు ఉండటం గమనార్హం. స్వచ్ఛందంగా తప్పుకున్న వారిలో మంత్రి కమలాకర్ సతీమణి గంగుల రజిత, ఆది శ్రీనివాస్ భార్య వనజ ఉన్నారు. ఇక బీఫాం ఇవ్వకపోవడంతో తిరస్కరణకు గురైన వారిలో మంథని నుంచి పుట్ట మధు సతీమణి శైలజ, చల్లా నారాయణ రెడ్డి సతీమణి సుజాత, పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డి కోడలు మమతారెడ్డి, కరీంనగర్ నుంచి పురమళ్ల శ్రీను సతీమణి లలిత, మానకొండూరులో కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ, కోరుట్లలో కె.సంజయ్ తండ్రి విద్యాసాగర్‌రావు ఉన్నారు. చొప్పదండిలో కాంగ్రెస్ రెబల్ నాగి శేఖర్, పెద్దపల్లి బీఆర్‌ఎస్ రెబెల్ నల్ల మనోహర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారు. సిరిసిల్ల నుంచి స్వతంత్ర అభ్యర్థి కటకం మృత్యుంజయం, వేములవాడ నుంచి బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ తుల ఉమ పోటీ నుంచి వైదొలిగారు.

ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడుచోట్ల డబుల్ ఈవీఎంలు వచ్చే అవకాశాలున్నాయి. సాధారణంగా ఒక ఈవీఎంలో గరిష్టంగా 16 గుర్తులు (నోటాతో కలిపి) కేటాయించే వీలుంది. ఒకవేళ అభ్యర్థులు 15 మంది దాటితే.. రెండో ఈవీఎం వినియోగం అనివార్యమవుతుంది. చొప్పదండి, మానకొండూరు, జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో సింగిల్ ఈవీఎం వినియోగించనున్నారు. ఇందులో చొప్పదండి, మానకొండూరు, ధర్మపురి ఎస్సీ నియోజకవర్గాలు. ఇక మిగిలిన కరీంనగర్, హుజూరాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 15 మందికి మించి ఉండటంతో ఇక్కడ రెండో ఈవీఎం తప్పనిసరి.

15, 15, 15

- జిల్లాలో మూడు నియోజకవర్గాలు
- ప్రతి నియోజకవర్గం నుంచి 15 మంది పోటీ
- ఒక్కో ఈవీఎంలో 15 మంది అభ్యర్థులకే అవకాశం
- అదనపు బ్యాలెట్ అవసరం లేకుండానే ఎన్నికలు



జగిత్యాల: జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ మూడు నియోజకవర్గాల్లో మొత్తం 45 మంది బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం జగిత్యాలలో 15, కోరుట్లలో 15, ధర్మపురిలో 15 మంది చొప్పున అభ్యర్థులు బరిలో ఉండటం విశేషం. జగిత్యాల స్థానానికి 21 మంది నామినేషన్ వేశారు. వీరిలో 19 మంది అభ్యర్థిత్వాలు ఆమోదం పొందగా.. రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. చివరిరోజు నలుగురు ఉపసంహరించుకోవడంతో 15 మంది మిగిలారు. కోరుట్లలో 25 మంది నామినేషన్లు వేశారు. వీరిలో 20 మంది అభ్యర్థిత్వాలు ఆమోదం కాగా.. ఐదు తిరస్కరణకు గురయ్యాయి. తాజాగా ఐదుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో ఇక్కడా 15 మంది బరిలో ఉన్నట్లయ్యింది. అలాగే ధర్మపురిలో 18 మంది నామినేషన్లు వేయగా.. 18 మంది ఆమోదంపొందారు. చివరి రోజు ముగ్గురు విరమించుకోవడంతో 15 మంది బరిలో నిలిచారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ 15 మంది చొప్పున బరిలో ఉండటం విశేషం. దీంతో అదనపు బ్యాలెట్ అవసరం లేకుండా పోయింది.

15మంది కంటే ఎక్కువ ఉంటే అదనపు బ్యాలెట్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు 15 మందికన్నా ఎక్కువగా ఉంటే ఈవీఎంలకు అదనంగా బ్యాలెట్ ముద్రణ ఏర్పాటు చేస్తుంటారు. అలా కాకుండా 15 మంది అభ్యర్థులుంటే ఒకే ఈవీఎం వినియోగిస్తారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాకతాళీయంగా 15 మంది అభ్యర్థుల చొప్పున బరిలో ఉన్నారు. 15కు మించి ఉంటే అదనపు బ్యాలెట్ యూనిట్‌ను ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు. 16వ నంబరును నోటాకు కేటాయించారు. మొత్తంగా జిల్లాలో అదనపు బ్యాలెట్ అవసరం లేకుండా మిగిలిపోయింది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, చిత్రంలో ఎన్నికల అధికారులు, పరిశీలకులు

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఓటు హక్కును ప్రతిఇక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటర్లు భయం లేకుండా.. ప్రలోభాలకు లొంగకుండా.. వ్యక్తిగత దూషణలకు పాల్పడకుండా.. నిర్భయంగా ఓటేసేలా ఓటర్లకు సూచించాలన్నారు. డబ్బు, మద్యం, బహుమతులు ఇచ్చినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని, సువిధ యాప్ ద్వారా ఇతర అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని, రూ.10వేలలోపు.. ఆపై లావాదేవీలను డిజిటల్ రూపంలో చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థుల క్రిమినల్ కేసుల వివరాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా మూడుసార్లు తప్పనిసరిగా ప్రకటన ఇవ్వాలన్నారు. జిల్లాలోని 221 మంది సర్వీస్ ఓటర్లకు ఈటీపీబీఎస్ రూపంలో పంపిస్తామన్నారు. ఎన్నికల సిబ్బందికి ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. ఎన్నికల అధికారులకు 1950 టోల్‌ఫ్రీ నంబరు 1800 425 7620, సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సాధారణ పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, బసవ రాజేంద్ర మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. నోడల్ అధికారులు సుధీర్, రఘువరణ్, శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది రానీయొద్దు

ఎన్నికల అధికారులు ప్రజలకు ఇబ్బంది రానీయకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సభ్యులతో సమావేశమయ్యారు. ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా చర్యలు

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఎన్నికల అధికారులు, ఇతర శాఖల సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తున్నామని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూస్తున్నామని తెలిపారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్లు 927 ఉన్నాయని, ఇందులో సాధారణ కేంద్రాలు 676, సమస్యాత్మక కేంద్రాలు 251గా గుర్తించామని, సమస్యాత్మక కేంద్రాలపై ప్రతిరోజూ నిఘా ఉంచుతున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

3351 మంది బైండోవర్

గతంలో ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వ్యక్తులతోపాటు సహకరించిన వారిని ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3351 మందిని బైండోవర్ చేశామని ఎస్పీ తెలిపారు. రౌడీషీటర్లను కూడా ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

రూ.2.35 కోట్లు స్వాధీనం

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి జిల్లాలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.2,35,61,331 సీజ్ చేశామన్నారు. అలాగే రూ.24,66,749 విలువైన 5,230 లీటర్ల లిక్కర్, 3,962 చీరలు, 1,228 టవల్స్, 950 సారిపెట్టికోట్స్, 1,907 వైట్ షర్ట్స్, 132 హ్యాండ్‌బ్యాగ్స్, 140 హాట్‌బాక్స్, 104 గడియారాలు, 21 షేవింగ్ మిషన్లను సీజ్ చేశామని, వీటి విలువ రూ.1,41,49,846 ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా సీజ్ చేసిన నగదు, లిక్కర్, బంగారం, ఇతర వస్తువుల విలువ రూ.4,17,36,140 ఉంటుందన్నారు. జిల్లా సరిహద్దుల్లో తొమ్మిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. మొబైల్ చెక్‌పోస్టులతోపాటు వెహికల్ చెకింగ్, నాఖాబందీ చేపడతామన్నారు. జిల్లాలో వ్యక్తిగత రక్షణ కోసం లైసెన్స్ తీసుకున్న 44 ఆయుధాలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

సోషల్ మీడియాపై నిఘా

ఎన్నికల నేపథ్యంలో సోషల్‌మీడియాపై 24 గంటలపాటు ఐటీ సభ్యులతో కూడిన స్పెషల్ టీంతో నిఘా పెడుతోందన్నారు. విద్వేషాలు, రెచ్చగొట్టేలా, కించపరిచేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీకోర్ టీంతో కూడిన స్పెషల్ టీంను నియమించామన్నారు. వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో వచ్చే పోస్టులకు గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తున్నట్లు తెలిస్తే డయల్ 100కుగానీ.. సంబంధిత పోలీస్‌స్టేషన్‌కుగానీ సమాచారం అందించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడినా.. ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

‘సూరమ్మ’ కాలువలు పూర్తి చేయాలి

- రూ.204 కోట్లతో పనులు ప్రారంభం

సాక్షి పీపుల్స్ ఎజెండా

కథలాపూర్(వేములవాడ): బీడుగా ఉన్న వేలాది ఎకరాల భూములను సాగులోకి తేవాలనే ఉద్దేశంతో జగిత్యాల – రాజన్నసిరిసిల్ల జిల్లాల సరిహద్దుల్లో ఉన్న కథలాపూర్ మండలం కలిగోట శివారులో ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా సూరమ్మ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు 2006లో ప్రణాళిక రూపొందించారు. సూరమ్మ రిజర్వాయర్ నుంచి ఎడమ, కుడి కాలువల ద్వారా కథలాపూర్, మేడిపల్లి, బీమారం, కోరుట్ల, మెట్‌పల్లి మండలాలకు చెందిన 50 వేల ఎకరాలకు నీరందించాలనేది లక్ష్యం. సూరమ్మ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల పనులకు రూ.204కోట్లు మంజూరు చేశారు. కలిగోట, అంబారిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామాల సరిహద్దుల్లో సుమారు 650ఎకరాల భూమి కేటాయించారు. ఆ కాలువల ద్వారా ఆయా గ్రామాల చెరువులను నింపుతూ.. చివరి ఆయకట్టుకు పక్కాగా నీరందించేందుకు ప్రణాళిక తయారుచేశామని అధికారులు పేర్కొన్నారు. దానిని త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



సూరమ్మ చెరువు

కాలయాపన వద్దు



సూరమ్మ ప్రాజెక్టు, కాలువ పనులు పూర్తయితే వేములవాడ నియోజకవర్గంలో నాలుగు మండలాలు, కోరుట్ల నియోజకవర్గంలో రెండు మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. రైతులకు మేలు చేసే ప్రాజెక్టు పనులను ఏళ్లతరబడి కాలయాపన సమంజసంకాదు. ఇది రైతులను మోసం చేసినట్లే.

– గుగ్లోత్ రవి, రైతు, భూషణరావుపేట

పరిహారం ఇవ్వాలి



కాలువ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. ఏ భూముల మీదుగా కాలువలు వెళ్తున్నాయో అధికారులు గుర్తించారు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారోనని నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం చొరవ చూపి కాలువ పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– జవ్వాజి ఆదిరెడ్డి, రైతు, అంబారిపేట

ఆశగా చూస్తున్నం



సూరమ్మ ప్రాజెక్టు ప్రణాళిక రూపొందిస్తే రైతులం సంబరపడినం. పనులు పూర్తయితే అన్ని చెరువులు నిండుతాయని ఆశగా ఎదురుచూస్తున్నాం. బొమ్మెన శివారులోని చెరువులు వర్షం కురిస్తేనే నిండుతాయి. అలాంటి చెరువులను సూరమ్మ ప్రాజెక్టు కాలువల ద్వారా నింపుతామని తెలిపారు.

– కోనేరెడ్డి జలంధర్‌రెడ్డి, రైతు, బొమ్మెన

నిర్లక్ష్యం దారుణం



సూరమ్మ రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేయడం దారుణం. కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలకు సాగు నీటి వసతిలేకుండా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సూరమ్మ రిజర్వాయర్, కాలువ పనుల్లో జాప్యం చేయడం సమంజసంకాదు. ప్రజాప్రతినిధులు బాధ్యతగా భావిస్తేనే త్వరగా పూర్తవుతాయి.

– కాశవత్తుల లక్ష్మిరాజం, ఎమ్మార్పీఎస్ నాయకుడు

ఉపాధ్యాయులు ప్రణాళికతో బోధించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అబ్జర్వర్ ఉషారాణి

జగిత్యాల: ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్ర అబ్జర్వర్ ఉషారాణి అన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలను బుధవారం సందర్శించారు. బోధన, అభ్యాసన సామగ్రి వినియోగం తప్పనిసరని, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ విషయాల్లో విద్యార్థులను బేస్‌లైన్ పరీక్ష ఆధారంగా స్థాయి నిర్ధారణ చేసుకుని దానికి అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. ఉన్నతికి సంబంధించిన మార్గదర్శకాలు తప్పనిసరి పాటించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, ప్రతిరోజు ప్రధానోపాధ్యాయుడు ఒక్కో టీచర్ క్లాస్‌ను అబ్జర్వ్ చేసి రికార్డు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు రాజేశ్, మురళీమోహన్ చారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

28 క్వింటాళ్ల మక్కలు చోరీ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో 28 క్వింటాళ్ల మక్కలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు రెబ్బటి చిన్నరాజన్న, చిట్యాల చిన్నొల్ల రాములు బుధవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం నుంచి గొధూర్ వెళ్లే రోడ్డుపై మక్కలు ఆరబోసి, విక్రయించామన్నారు. కొనుగోలుదారుడు వాటిని రోడ్డు పక్కనే నిల్వ ఉంచగా దొంగలు మంగళవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంబులెన్స్‌లో సాధారణ ప్రసవం



అంబులెన్స్‌లో డెలివరీ చేసిన సిబ్బంది

ధర్మపురి: పురిటి నొప్పులతో బాధ పడుతున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది అంబులెన్స్‌లోనే నార్మల్ డెలివరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన స్వప్న అనే గర్భిణికి మంగళవారం అర్ధరాత్రి పురిటినొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ వచ్చింది. ఆమెను జగిత్యాల తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సిబ్బంది అనిల్‌కుమార్, ఖయ్యూంలు అంబులెన్స్‌లోనే స్వప్నకు సాధారణ ప్రసవం చేశారు. ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ ప్రదానం



పట్టా అందుకుంటున్న చంద్రశేఖర్

మల్యాల(చొప్పదండి): మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన ఎనుగుల చంద్రశేఖర్ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కరుణ ఆధ్వర్యంలో బయో కెమిస్ట్రీలో మైటోకాండ్రియల్ ప్రోటీన్‌పై పరిశోధన చేశారు. చంద్రశేఖర్ ప్రస్తుతం కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ కరుణ పట్టా అందజేశారు. చంద్రశేఖర్ డాక్టరేట్ సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

లాడ్జీల్లో తనిఖీలు



జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని పలు లాడ్జీల్లో సీఐ రమేశ్ ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. గదుల్లో అద్దెకు దిగినవారి బ్యాగులు చెక్ చేశారు. లాడ్జీల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా అద్దెకు దిగేవారి వివరాలు నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానితులు, అపరిచితులు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎస్‌ఐలు శ్రీధర్, రాజేశ్, ఏఎస్‌ఐలు రాధాకిషన్, వెంకటేశ్వర్లు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- బయల్దేరిన ఐదు నిమిషాల్లోనే..
- కారు బోల్తాపడి ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- కూతురును కళాశాలలో దింపేందుకు వెళ్తుండగా ఘటన
- హబ్సీపూర్, రాజారం గ్రామాల్లో విషాదం



సంఘటన స్థలంలో నుజ్జునుజ్జయిన కారు



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



మహేశ్ మృతదేహం



భాస్కర్ మృతదేహం

జగిత్యాల క్రైం: కూతురును కళాశాలలో దింపేందుకు ఓ వ్యక్తి తన బంధువులతో కలిసి కారులో ఆనందంగా బయల్దేరాడు.. కానీ, ఐదు నిమిషాల్లోనే ఆ వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో హబ్సీపూర్, రాజారం గ్రామాల్లో విషాదం నెలకొంది. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామానికి చెందిన దేవరకొండ భాస్కర్(35) బుధవారం ఉదయం తన అత్తగారి గ్రామమైన హబ్సీపూర్‌కు కారులో వచ్చాడు. తన పెద్ద కూతురు అక్షరను కరీంనగర్‌లోని కళాశాలలో దింపేందుకు మామ, హబ్సీపూర్‌కు చెందిన ఇమ్మడి నందయ్య, బావమరిది శ్రీకాంత్, నందయ్య తమ్ముడి కొడుకు మహేశ్‌లతో కలిసి కారులో బయల్దేరాడు. కానీ, దురదృష్టవశాత్తు అది పొలాస శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై అదుపుతప్పి, బోల్తాపడింది. ఈ ఘటనలో భాస్కర్, మహేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. నందయ్య, అక్షర, కారు నడుపుతున్న శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సదాకర్ సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు భాస్కర్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, భాస్కర్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, మహేశ్‌కు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఇరు కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎమ్మెల్సీ పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో దేవరకొండ భాస్కర్, ఇమ్మడి మహేశ్‌లు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

ప్రచారం కన్నా చేరికలకే ప్రాధాన్యం

- బలం ఉన్న నాయకులపై ప్రధాన పార్టీల అభ్యర్థుల దృష్టి
- నిత్యం జంపింగ్‌లతో ప్రజల్లో అయోమయం
- జిల్లాలో పరిస్థితి

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం కన్నా తమ పార్టీలో చేరికలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. బలమైన ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టి పెడుతూ వారిని చేర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన అనేక మంది నిత్యం ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారుతున్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేపడుతూ గ్రామాల్లో ఎవరెవరు ముఖ్య నాయకులు, కార్యకర్తలున్నారో ఆరా తీస్తున్నారు. అలాగే, వివిధ పార్టీల్లో ఉన్న అసంతృప్తులను సైతం తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ముఖ్య నాయకులకు బాధ్యతలు

అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతుండగా ఆయా పార్టీల్లోని ముఖ్య నాయకులకు చేరికల బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు ఏ నాయకుడిని పార్టీలో చేర్చుకుంటే లాభం జరుగుతుందో అంచనా వేస్తూ చాలామందిని ఆహ్వానిస్తున్నారు. ఫలితంగా ప్రధాన పార్టీలో నిత్యం జంపింగ్‌లతో ప్రజల్లో అయోమయం నెలకొంది. ఎవరు ఏ పార్టీలో చేరుతున్నారో తెలియడం లేదని అంటున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో మూడు నియోజకవర్గాల్లో 45 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరో 12 రోజులు మాత్రమే ప్రచార గడువు ఉండటంతో చేరికలు ఊపందుకున్నాయి. ముఖ్య నాయకులు రాత్రంతా గ్రామాల్లో, పట్టణాల్లోనే గడుపుతూ పలువురిని అభ్యర్థుల ఇంటికి తీసుకెళ్లి, మాట్లాడిస్తున్నారు. చర్చలు సఫలమైతే కండువాలు కప్పేస్తున్నారు.

అన్నా.. ఎవరు గెలుస్తారంటావ్?

- 'ధర్మపురి'లో ఎక్కడ చూసినా ఎన్నికల ముచ్చట్లే
- చర్చలకు వేదికలవుతున్న రచ్చబండలు, చాయ్ హోటళ్లు, గ్రామ కూడళ్లు



బతికపల్లి గ్రామ చావిడి వద్ద మాటామంతీ

పెగడపల్లి: నలుగురు ఒక్కచోట చేరితే కావల్సినంత కాలక్షేపం. ఒకప్పుడైతే పిల్లల చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయానికి సంబంధించిన కబుర్లు. తమ బంధువుల విషయాలు, విందు వినోదాల అంశాలే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చేవి. వారం రోజులుగా ఆ ముచ్చట్లకు ఫుల్‌స్టాపు పడి, ఎన్నికల ఊసులే కాలక్షేపంగా మారాయి. అన్నా.. రాష్ట్రంలో ఎవరు వస్తారంటావ్.. మామా.. మన నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారంటావ్.. బాబాయ్ మీ అనుభవంతో చెప్పండి.. ఇదీ ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామాల్లో రచ్చబండలు, ప్రధాన కూడళ్లు, చాయ్ హోటళ్లలో సాగుతున్న చర్చ.

అభివృద్ధి, పథకాలపై చర్చ..

ధర్మపురి నియోజకవర్గంలో ప్రస్తుత మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ నుంచి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కాంగ్రెస్, సోగాల కుమార్ బీజేపీ, నక్క విజయ్‌కుమార్ బీఎస్పీ నుంచి, కొందరు స్వతంత్రులు అసెంబ్లీ బరిలో ఉన్నారు. అభ్యర్థులతోపాటు వారి సతీమణులు, అనుచరులు, పార్టీ శ్రేణులు నిర్దేశించుకున్న ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. దీంతో కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారి నుంచి వృద్ధుల వరకు ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల మాటలే వినిపిస్తున్నాయి. అభ్యర్థుల అనుకూల, ప్రతికూల అంశాలను ప్రస్తావిస్తూ ఈసారి ఆయా కారణాలే ఆయన గెలుపునకు దారితీస్తాయంటూ ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. ఎవరికి ఏకపక్షంగా ఉండదని, తీవ్ర పోటీ ఉంటుందని అంటున్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మారం, వెల్గటూర్, బుగ్గారం, ధర్మపురి, ఎండపల్లి మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోని కూడళ్లు, చాయ్ హోటళ్లు, చావిడిల వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం చాలామంది వృద్ధులు, యువకులు, రైతులు ఎన్నికల ముచ్చట్లలో నిమగ్నమవుతున్నారు. పార్టీల మేనిఫెస్టోలతోపాటు గతంలో జరిగిన అభివృద్ధి, పథకాలపై చర్చించుకుంటున్నారు. అభ్యర్థులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తపరుస్తూనే.. అప్పుడప్పుడు వాదోపవాదాలకు దిగుతున్నారు. చివరికి అందరూ కలిసి, వేడి వేడి చాయ్ తాగి, చిరునవ్వు చిందిస్తూ ఎవరి ఇళ్లకువారు వెళ్లిపోతున్నారు.

పోలీస్ అధికారిపై దాడి కేసులో ఒకరికి జైలు

సిరిసిల్లక్రైం: పోలీస్ అధికారిపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2013 జూలై 28న సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లో తబ్లిక్ జమాత్, సున్నీ జమాత్‌కు చెందిన ముస్లింలు రెండుగా విడిపోయి గొడవ చేసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న అప్పటి సీఐ ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి ఆపేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో సిరిసిల్లకు చెందిన మహ్మద్ తాజ్ సీఐపైకి రాయి విసరడంతో చేతికి గాయమైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దాడికి కారణమైన తాజ్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పును వెల్లడిస్తూ మహ్మద్ తాజ్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. శాంతిభద్రతల రక్షణలో అనునిత్యం పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బందిపై దాడులకు దిగిన, విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

చోరీ కేసులో ఇద్దరికి..

ఆలయాల్లో దొంగతనం చేసిన కేసులో ఇరువురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే 2023 జూన్ 29న రగుడు ఎల్లమ్మ ఆలయం, సిరిసిల్ల విశ్వనాథ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీ చేశారని ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి మైలారం ఆశారాములు, బాల నర్సింహులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి బీసీ నాయక్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ఎస్సై లావుడ్య శ్రీకాంత్, కానిస్టేబుల్ నరేశ్‌లు సాక్ష్యాలు ప్రవేశపెట్టడంతో పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ఆశారాములు, నర్సింహులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కోంద్ర కల్యాణ్(25) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం అతని భార్య పని నిమిత్తం కరీంనగర్ వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో కల్యాణ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రూ.లక్ష సీజ్

కథలాపూర్(వేములవాడ): కలిగోట శివారు చెక్‌పోస్టు వద్ద బుధవారం రూ.లక్ష పట్టుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. దూలూర్‌కు చెందిన గంగారెడ్డి కారును తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అందులో నగదు దొరకడంతో నిబంధనల ప్రకారం సీజ్ చేసి, ఉన్నతాధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన భార్గవ్ తన బైక్‌పై పెద్దపల్లి వైపు వెళ్తుండగా.. పెద్దపల్లి వైపు నుంచి ప్లాంట్‌కు వస్తున్న లారీ క్రాసింగ్ వద్ద బైక్‌ను ఢీకొంది. దీంతో భార్గవ్ కాలుకు తీవ్రగాయం కాగా చికిత్స నిమిత్తం ఖని ప్రభుత్వ ఆస్పతిలో చేర్పించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మి

రామగుండం:కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ లీగ్ పోటీలను అంతర్గాం మండల కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఎనిమిది మండలాల నుంచి జట్లు హాజరయ్యాయి. అంతర్గాం వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి పోటీలు ప్రారంభించారు. తొలిరోజు గోదావరిఖని–యైటింక్లయిన్‌కాలనీ, అంతర్గాం–కరీంనగర్, గోదావరిఖని–హుజూరాబాద్ జట్లు తలపడ్డాయి. గురువారం పోటీలు ముగుస్తాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రతినిధులు డబ్ల్యూ.గణపతి, కోల సంతోష్‌గౌడ్, వెంకట్రావు, వెంకటేశ్, నరేశ్‌కుమార్, అంగోతు శ్రీనివాస్, ప్రవీణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని వైన్స్‌ల నుంచి వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన తాళ్లపెల్లి స్వామి, రాపర్తి రవి బుధవారం అక్రమంగా మద్యం తరలిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.26,730 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్‌ఐలు కబీర్‌దాస్, రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుళ్లు మహేశ్, పద్మావతి, శైలజ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వేగురుపల్లి గ్రామంలో..

మానకొండూర్: మండలంలోని వేగురుపల్లికి చెందిన మాజీ సర్పంచి ముద్దసాని శ్రీధర్ రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఎన్నికల అధికారులు, పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఆయన ఇంట్లో తనిఖీలు చేయగా 16 మద్యం బాటిళ్లు దొరికినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని, శ్రీధర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పుస్తెలతాడు చోరీకి యత్నించిన కేసులో..

- నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ధర్మపురి: ఓ వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీకి యత్నించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ రమణామూర్తి తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. ధర్మపురికి చెందిన వ్యక్తి కొన్నేళ్లుగా ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10న ధర్మపురికే చెందిన ఒజ్జల నర్సమ్మ అనే వృద్ధురాలు పిండి గిర్ని వద్దకు వెళ్తుండగా బైక్‌పై వచ్చి, ఆమె మెడలోని పుస్తెలతాడును లాగడంతో తెగి, కిందపడింది. బాధితురాలు కేకలు వేయడంతో వదిలేసి, పారిపోయాడు. నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు 4 బృందాలుగా ఏర్పడి, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ధర్మపురి దుర్గమ్మ కాలనీ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన వివిధ మండలాల ఎస్‌ఐలను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

హార్వెస్టర్‌కు నిప్పు?



కాలిపోయిన హార్వెస్టర్ ముందుభాగం

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలోని రైతు నార సత్తయ్యకు చెందిన హార్వెస్టర్‌ను దుండగులు దహనం చేశారు. సత్తయ్య గ్రామశివారులోని తన పొలంలో మంగళవారం రాత్రి వరకూ వరికోశాడు. యంత్రాన్ని పొలంలోనే ఉంచి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా హార్వెస్టర్ ముందుభాగం పూర్తిగా కాలిపోయి ఉంది. రాత్రివేళ దుండగులు ఈదుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈవిషయంపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈఘటనలో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు సత్తయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



ముత్తారం(మంథని): కాసార్లగడ్డ బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓడెడ్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఓడెడ్‌కు వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొనడంతో బస్సు అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాసార్లగడ్డ – అడవిశ్రీరాంపూర్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, మంథని–ఓడెడ్ ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా ఇరుకుగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. రోడ్డును ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉనికి కోల్పోయిన కామ్రేడ్స్

- కమ్యూనిస్టులకు ఉమ్మడి జిల్లా ఆయువుపట్టు
- 'అనభేరి, బద్దం' వంటి మహామహుల పురిటి గడ్డ
- 1952 నుంచి పలువురు చట్టసభలకు..
- సాయుధ పోరాటం, ప్రజల పక్షాన గొంతు వినిపించిన చరిత్ర
- నేడు అర్థబలం, అంగబలం లేక చతికిల పడిన వైనం
- తొలిసారి ఇక్కడి నుంచి పోటీకి దూరం



వెంకట్‌రెడ్డి



రాజేశ్వర్‌రావు (ఫైల్)



అనభేరి (ఫైల్)



ఎల్లారెడ్డి (ఫైల్)



చిన్నమల్లయ్య (ఫైల్)



సీపీఐ శ్రేణుల ర్యాలీ (ఫైల్)

కరీంనగర్: నిజాం నిరంకుశ, రాచరిక పాలన, రజాకార్లు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసిన చరిత్ర సీపీఐది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు ఆ పార్టీని ఎంతగానో ఆదరించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల నుంచి పలుమార్లు ఎర్రజెండాను చట్టసభలకు పంపారు. ఆ నేతలు కూడా ప్రజల పక్షాన తమ గొంతు వినిపించారు. ఉమ్మడి జిల్లా మొదటి నుంచి కమ్యూనిస్టులకు ఆయువుపట్టుగా నిలిచింది. నిజాం నవాబు రాచరిక పాలన అంతం కోసం పోరాడి, తొలి ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన అనభేరి ప్రభాకర్‌రావు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సేనాని బద్దం ఎల్లారెడ్డిలతోపాటు ఎందరో అగ్రగణ్యులను అందించిన కరీంనగర్ వామపక్ష పోరాటాలకు పుట్టినిల్లయింది. అనభేరి ప్రభాకర్‌రావు సీపీఐ జిల్లా తొలి కార్యదర్శి కావడం గమనార్హం. అమృతలాల్ శుక్లా, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, దేశిని చిన్నమల్లయ్యలు జిల్లా కార్యదర్శులుగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సారథ్యం వహించి, ప్రస్తుతం జాతీయ నాయకుడిగా ఉన్న చాడ వెంకట్‌రెడ్డి సైతం జిల్లాకు చెందినవారే. అలాగే, 1952లో కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును ఓడించిన బద్దం ఎల్లారెడ్డి సీపీఐ నాయకుడే.

ఏడు నియోజకవర్గాల్లో గెలుపు..

తొలినాళ్లలో కరీంనగర్‌తోపాటు అప్పటి నుస్తులాపూర్, ఇందుర్తి, బుగ్గారం, చొప్పదండి, మేడారం, నేరెళ్ల అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ, పీడీఎఫ్ అభ్యర్థులుగా చీటి వెంకటరామారావు, బద్దం ఎల్లారెడ్డి, చెన్నమనేని రాజేశ్వర్‌రావు, బి.మల్లారెడ్డి, అమృతలాల్‌శుక్లా, దేశిని చిన్నమల్లయ్యలు విజయం సాధించారు. అలాగే, ఉమ్మడి శాసనసభలో చెన్నమనేని రాజేశ్వర్‌రావు, చాడ వెంకట్‌రెడ్డిలు సీపీఐ శాసనసభాపక్ష నేతలుగా వ్యవహరించారు. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరగగా, ఇందుర్తిలో 8 సార్లు, సిరిసిల్లలో 6 సార్లు సీపీఐ అభ్యర్థులు గెలవడం గమనార్హం. అలాగే, 1952 నుంచి రెండు దశాబ్దాలపాటు కమ్యూనిస్టులు అసెంబ్లీతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడక్కడ విజయం సాధిస్తూ గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉండేవారు.

2009 నుంచి ఒక్క ఎమ్మెల్యే లేరు

జిల్లాలో ఘన చరిత్ర గల సీపీఐ మారుతున్న సమీకరణాలను ఆకలింపు చేసుకోలేక ప్రజలకు దూరమవుతోంది. ఉమ్మడి జిల్లాలో 2009 నుంచి ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థి కూడా లేకపోవడం ఆ పార్టీ ఎంత బలహీనంగా ఉందో చెబుతోంది. సిరిసిల్ల, ఇందుర్తి ఏరియాల్లో ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అంతో ఇంతో పట్టు సాధిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో యువతను పార్టీలోకి ఆకర్షించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. దీనికితోడు 1994 నుంచి జరుగుతున్న అంతర్గత పోరు పార్టీకి తీరని నష్టం కలిగిస్తుందన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఒక్క హుస్నాబాద్ నియోజకవర్గంలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో క్యాడర్ ఉంది. ఈసారి ఎన్నికల్లో సీట్ల ఒప్పందంలో భాగంగా దాన్ని కాంగ్రెస్‌కు కేటాయించడంతో కార్యకర్తలు నిరాశకు లోనయ్యారు. 2018 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన చాడ వెంకట్‌రెడ్డికి 48 వేల ఓట్లు వచ్చాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణం పటిష్టంగా లేకపోవడం, ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఎన్నికల్లో తలపడే అర్థబలం, అంగబలం లేక ఉనికి కోల్పోయినట్లు కామ్రేడ్లు అంగీకరిస్తున్నారు. దీంతో గతమెంతో ఘనమని చెప్పుకుంటూ తృప్తి చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.